క్లుప్తంగా

నేడు 'స్పందన'

యల్లనూరు: తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని తహసీల్దారు రమాదేవి కోరారు. సిబ్బందిని పంపించి అధికారులు గైర్హాజరైతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

నేడు బందార్లపల్లి నుంచి 'ప్రజా సంక్షేమ యాత్ర'

పెద్దవడుగూరు: మండలంలోని బందార్లపల్లి నుంచి సోమవారం తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రజా సంక్షేమ యాత్ర ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల నాయకులు తెలిపారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. బందార్లపల్లి నుంచి ప్రారంభమై అప్పేచర్ల మీదుగా కడదరగుట్టపల్లి, క్రిష్టిపాడు గ్రామాలకు యాత్ర సాగుతుందన్నారు.

వైద్య శిబిరం



రోగుని పరీక్షిస్తున్న వైద్యుడు

గుంతకల్లు: స్థానిక రోటరీ హైస్కూల్‌లో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గ్యాస్ట్రో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి ప్రారంభించారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు ఆధ్వర్యంలో దాదాపు 100 మంది పైగా రోగులను వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితగా మందులు పంపిణీ చేశారు. దాతలు డాక్టర్ సీ. ప్రణీత్‌రెడ్డి, వీ.కామకృష్ణయ్య, శిరీష్‌కుమార్, రోటరీ క్లబ్ జోనల్ సెక్రటరీ వీ.అనురాధగుప్తా, సభ్యులు పాల్గొన్నారు.

ఆశ్వత్థం తిరునాలకు 15 ఆర్టీసీ సర్వీసులు



తాడిపత్రి ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేసిన బస్సు

తాడిపత్రి టౌన్: పెద్దపప్పూరు మండలం ఆశ్వత్థ నారాయణస్వామి తిరునాలకు రెండో ఆదివారం 15 ప్రత్యేక సర్వీసులను నడిపినట్లు ఆర్టీసీ డీఎం శంకర్ తెలిపారు. భక్తుల సౌకర్యం కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. తాడిపత్రి ఆర్టీసీ బస్టాండ్‌లో ఆశ్వత్థం తిరునాలకు సంబంధించి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు.

విద్యార్థులకు అవార్డుల ప్రదానం



విద్యార్థికి క్యాష్‌తోపాటు ప్రశంసాపత్రం అందిస్తున్న ఆశోక్‌కుమార్‌రెడ్డి

తాడిపత్రి టౌన్: స్థానిక కడప రోడ్డులో టెక్ జూనియర్ కళాశాలలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు కళాశాల యాజమాన్యం ట్యాలెంట్ టెస్ట్ నిర్వహించింది. పరీక్షకు 1500 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో అత్యంత ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉచితంగా ఇంటర్ విద్య చదివేందుకు అవకాశం కల్పించనున్నట్లు కరస్పాండెంట్ అశోక్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రామాంజనేయులు తెలిపారు. ఈసందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు క్యాష్ అవార్డుతోపాటు ప్రశంసా పత్రాలు అందజేశారు.

సంత ద్వారా రూ.1.92 లక్షల ఆదాయం

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన జీవాల సంత ద్వారా రూ.1,92,120 ఆదాయం సమకూరినట్లు యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ వై.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పశువులకు వ్యాపిస్తున్న ముద్దచర్మవ్యాధి కారణంగా గతేడాది సెప్టెంబర్ మూడో వారం నుంచి మార్కెట్‌యార్డులో పశువుల సంత బంద్ చేశామన్నారు. శనివారం మాత్రమే గొర్రెలు, మేకల క్రయ విక్రయాలు జరుగుతాయన్నారు.

పంపనూరులో అరుణ హోమం

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మాఘమాసం రెండో ఆదివారం అరుణ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌కు ఉదయం నుంచి సాయంత్రం వరకు పాలాభిషేకం, బంగారు కవచ సేవ, అలంకరణ, ఆకుపూజ, కుజదోష , రాహుకేతు దోష, సర్పదోష కాల సర్పదోష, రాహుకేతు దోష, సుబ్రహ్మణ్యేశ్వర బీజాక్షరం వంటివి నిర్వహించారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి
- నాగులగుడ్డం తండాలో 'గడప గడపకూ మన ప్రభుత్వం'



సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి తెలియజేస్తున్న కమలమ్మ

శింగనమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం నాగులగుడ్డం తండాలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి మూడున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. ఈసందర్భంగా కమలమ్మ అనే మహిళ ఎమ్మెల్యేతో ముచ్చటించారు. 'మేము చిన్నప్పుడు బడిలో రాగిముద్ద పెట్టేవారని, ఆ తర్వాత ఎవరూ మంచి భోజనం పిల్లలకు పెట్టేవారు కాదని, జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత బడిలో మంచి భోజనం పెడుతున్నారని, మాకు అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయి. మళ్లీ జగనన్న సీఎం అవుతారని' చెప్పుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అన్నీ చేస్తున్నామని, ఆదే మనల్ని నడిపిస్తూ, గెలిపిస్తుందని పదేపదే జగన్న చెబుతుంటారని గుర్తు చేశారు. పేద ప్రజలకు పట్టెడన్నం తింటున్నారని, వృద్ధులు ప్రతి నెలా ఠంచన్‌గా పింఛన్ తీసుకుంటున్నారన్నారు. జగనన్న విద్య, వైద్యానికి పెద్ద పీట వేస్తున్నారన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, వెస్ట్ నరసాపురం సర్పంచ్ వెంకట్రాముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు నగేష్, భాద్యానాయక్, రామకృష్ణ, శ్రీనివాసులుబాబు, రవికుమార్, తిరుపాలునాయక్, అంజినాయక్, భాస్కర్‌నాయక్ , తహసీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఈఓఆర్‌డీ శివనారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి జేసీ ప్రభాకర్‌రెడ్డికి లేదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెద్దవడుగూరు : తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డికి లేదని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, అనంతపురం పార్లమెంట్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేస్తున్న పాదయాత్ర ప్రశ్చాత్తాప యాత్ర అని కరపత్రాలు వేయడం నీచమన్నారు. జేసీ సోదరులు 30 ఏళ్ల రాజకీయ చరిత్ర లో ఏనాడు చివరి ఆయకట్టు వరకూ నీళ్లు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. రైతులు కాలువ కు మోటర్లు వేస్తే వారిపై అక్రమ కేసులు పెట్టి వారిని చిత్ర హింసలకు గురిచేసిన చరిత్ర మీది కాదా అని ప్రశ్నించారు. ప్రస్తుతం మండలంలోని ఆయకట్టు భూములకు సాగునీరు అందించడంతో పాటు అనధికార ఆయకట్టుకు నీరు అందిస్తున్న ఘనత ఎమ్మెల్యే పెద్దారెడ్డి కే దక్కిందన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ప్రజలకు మరింత చేరువ కావడం కోసం చేస్తున్న ప్రజా సంక్షేమ యాత్రను చూసి జేసీ ప్రభాకర్‌రెడ్డి ఎమ్మెల్యేపై బురదజల్లేందుకు యత్నిస్తున్నారన్నారు. తాడిపత్రి మార్కెట్ యార్డు పదవి కోసం ఎమ్మెల్యే డబ్బు తీసుకున్నాడని తప్పుడు రాతలు రాసి పేపర్లు వేసి వైఎస్సార్‌సీపీ కార్యకర్తల మధ్య కక్షలకు ఆజ్యం పోస్తున్నారని జేసీ ప్రభాకర్‌రెడ్డిపై మండిపడ్డారు. మండలంలోని నాయకులు తీర్మానించుకుని ఎమ్మెల్యేను అడుగగా ఆయన ఇచ్చిన మాట ప్రకారం కొట్టాలపల్లి హరినాథరెడ్డికి తాడిపత్రి మార్కెట్‌యార్డు పదవి ఇచ్చారన్నారు. గతంలో పెద్దవడుగూరు లో సీసీ రోడ్లకు పీపీ ప్రసాద్‌రెడ్డి ద్వారా కమీషన్లు వసూలు మీరే చేయించారని ఆరోపించారు. చాగల్లు కాలువ తవ్వే సమయంలో మట్టిని రైతులు తోలుకుంటే ఆమట్టికి ట్రిప్పుకు రూ.50 రూపాయల చొప్పున వసూలూ చేసి దాదాపు రూ.10 లక్షలకు పైగా డబ్బును మీరే కాజేశారన్నారు. జేసీకి ధైర్యం ఉంటే ఎమ్మెల్యే పెద్దారెడ్డి తో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. రైతుల కష్టాలను తెలుసుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేడు చిట్టూరు నుంచి తరిమెల కు పెన్నానది లో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు టెండర్లు పిలుస్తున్నారన్నారు. మండలం చుట్టూ రహదారులను ఏర్పాటు చేశారన్నారు. నాయకులు ప్రకాష్‌రెడ్డి, లక్ష్మంపల్లి హరికృష్ణారెడ్డి, పుట్లూరు కృష్ణారెడ్డి, బాబు రెడ్డి, తలారి గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

సునామ జకినీ మాత జాతరకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఆరె కటిక సంఘం నాయకులు

గుత్తి: స్థానిక ఆర్ఎస్ రోడ్డులో ఉన్న సునామ జకినీ మాత ఆలయంలో ఫిబ్రవరి 2 నుంచి తలపెట్టిన జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆరె కటిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలూరు లక్ష్మణరావు అన్నారు. సునామ జకినీ మాత ఆలయంలో ఆదివారం ఆయన ఆరె కటిక సంఘం నాయకులు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. దేశంలోనే ఏకైక ఆరె కటికల ఆరాధ్య దైవం సునామ జకినీ మాత ఆలయం గుత్తిలో మాత్రమే ఉందన్నారు. 20 ఏళ్ల క్రితం ఆలయం నిర్మించామని, అప్పటి నుంచి మాఘ మాసంలో అమ్మవారి జాతర జరుపుతున్నామన్నారు. జాతరకు ఏపీ, తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు నుంచి ఆరె కటికలు పెద్ద ఎత్తున తరలివస్తారన్నారు. ఆలయ ధర్మ కర్త సురేష్‌రావు, ఆలయ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కసాపురం నాగరాజు, బాబురావు, సుధాకర్ రావు, రవి బాబు, ప్రధాన కార్యదర్శి సాయినాథ్, కోశాధికారి రామచంద్రరావు, యూత్ నాయకులు భాగ్యరాజ్, లక్ష్మీకాంత్, శ్రీనివాసులు, ఆలయ మేనేజర్ పంకజ లక్ష్మి పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

గుత్తి: పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఆదివారం ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కిందపడి ఓ వ్యక్తి గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. జొన్నగిరి గ్రామానికి చెందిన రంగయ్య తన స్నేహితునితో కలిసి బైక్‌లో వెనుక కూర్చొని గుత్తికి బయలు దేరారు. అయితే గుత్తిలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద స్పీడ్ బ్రేకర్ వద్ద ప్రమాదవశాత్తు రంగయ్య జారి కింద పడటంతో గాయపడ్డాడు. స్థానికులు అతడిని ప్రభుత్వా సుపత్రికి తరలించారు.

ఘనంగా ఆరాధనోత్సవం



ప్రసంగిస్తున్న ఆర్మీ మేజర్ దామోదర్

పామిడి: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో గుత్తి డివిజనల్ చైర్మన్ పాస్టర్ డేవిడ్‌నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం ఆరాధనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉత్తర భారత దేశ ఆర్మీ మేజర్, చండీఘడ్ దైవ సేవకుడు దామోదర్ ప్రసంగించారు. రోజూ దేవుని వాక్యాన్ని పఠించడం వల్ల నిజమైన భయ భక్తులు చేకూరుతాయన్నారు. కార్యక్రమంలో చర్చి సెక్రటరీ పరదేశి విజయశేఖర్‌రాజు, సభ్యులు వీరయ్య, జయరాజు, అబ్రహాం, రవిరాజు, కరుణాకర్, అరుణ్, కిష్టఫర్ బాబు, ప్రసాద్, రజని, అనూష, ప్రిస్కిల్లా, ప్రశాంతి, కీర్తిమణి, మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

తాడిపత్రి టౌన్: అనంతపురంలో ఈనెల 31న విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన జిల్లా విద్యార్థి సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఏబీవీపీ నగర కార్యదర్శి హరినారాయణ విద్యార్థులను కోరారు. స్థానిక ఏబీవీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు 125వ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని ఏబీవీపీ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా విద్యార్థి సమ్మేళనాలను నిర్వహిస్తోందన్నారు. అనంతపురంలో జరిగే కార్యక్రమానికి పెద్దసంఖ్యలో విద్యార్థులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

నారాయణ స్వామి..నమోస్తుతే!



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు



తిరునాలకు విచ్చేసిన భక్తులు

పెద్దపప్పూరు: మాఘమాసం అశ్వత్థం తిరునాల్లో భాగంగా రెండో ఆదివారం క్షేత్రం నారాయణస్వామి నామస్మరణతో మార్మోగింది. ఉదయం నుంచి అర్చకులు శింగరబట్లు, గణపతి, నారాయణ స్వామి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ నుంచి నారాయణస్వామిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ముందుగా భక్తులు పెన్నానదిలో పుణ్యస్నానాలు ఆచరించి తడి దుస్తులతో ఓం నమో నారాయణాయ అంటూ స్వామి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కోర్కెలు నెరవేరిన భక్తులు ముడుపులు, కానుకలతో పాటు తలనీలాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం భక్తులకు సౌకర్యాలు కల్పించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోమస్తు ఏర్పాటు చేశారు.

నేటి నుంచి ఆలయ ప్రతిష్టాపనోత్సవాలు



విద్యుద్దీపాల అలంకరణలో షిర్డీసాయి ఆలయం

పెద్దవడుగూరు : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన షిర్డీసాయి ఆలయంలో సోమవారం నుంచి ఫిబ్రవరి 3 వరకూ ఆలయ ప్రతిష్టాపనోత్సవాలు నిర్వహించనున్నట్లు షిర్డీసాయిబాబా సేవాసమితి సభ్యులు హరినాథరెడ్డి, సూర్యనారాయణరెడ్డి తెలిపారు. తొలిరోజు ఉదయం గోపూజ, గణపతి పూజ, పుణ్యహవచనం, విగ్రహ అభిషేకాలు, జపాలు, చండీపారాయణం, అఖండ దీపారాధన ఉంటాయన్నారు. మంగళవారం ప్రాతఃకాల పూజలు, వేద పారాయణాలు, యంత్ర, విగ్రహ అభిషేకాలు, చతుర్లింగతోభద్రమండల ఆవాహన, గణపతి హోమం, కుబేర పాశుపత రుద్రహోమం నిర్వహిస్తామని తెలిపారు. ఫిబ్రవరి 01న సాయిబాబా వారి గ్రామోత్సవం, 2న పూజలు, అభిషేకాలు, సాయిబాబా విగ్రహమును నిజమందిరానికి చేర్చుట, ప్రదోష పూజలు జరుగుతాయన్నారు. 3 న శిఖర ప్రతిష్ట, గర్త పూజలు, గణపతి, దత్తాత్రేయ, లక్ష్మీ, ఆంజినేయ స్వామి , నవగ్రహ ప్రతిష్ట, కలశ ఉద్వాసన, కుంభాభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.

అనాథకు అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు : స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహానికి ఆ నలుగురు సేవా సమతి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించి మనవత్వాన్ని చాటుకున్నారు. రైల్వేస్టేషన్ రోడ్డులో ఓ గుర్తుతెలియని మృతదేహం పడి ఉందని వన్‌టౌన్ పోలీసుల నుంచి సమాచారం అందుకున్న ఆ నలుగురు సేవాసమతి సభ్యులు వాల్మీకి సర్కిల్ వద్దనున్న హిందూ శ్మశాన వాటికకు తరలించి హిందూ సంప్రదాయ పద్ధతిలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఆ నలుగురు సేవా సమతి కార్యదర్శి మొండ్ల కేశవ, సభ్యులు నవీన్, శ్రీను, హెడ్ కానిస్టేబుల్ నారాయణ, కానిస్టేబుల్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం



అగ్నికి ఆహుతవుతున్న పశుగ్రాసం

యాడికి: పుప్పాల గ్రామంలో శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పశుగ్రాసం దగ్ధమైంది. గ్రామస్తుల వివరాల మేరకు..గ్రామానికి చెందిన దొడ్డి ఆదినారాయణ తన దొడ్డిలో పశువుల మేత కోసం వేరుశనగ, జొన్నసొప్ప, వరిగడ్డితో వాము వేసుకున్నాడు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో ఆకతాయిలు నిప్పు పెట్టారు. సమాచారం అందుకున్న తాడిపత్రి ఫైరింజన్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేశారు. అయితే అప్పటికే వామి పూర్తిగా కాలిపోయింది. మాజీ జెడ్పీటీసీ వెంకట రామిరెడ్డి పుప్పాలకు వెళ్లి బాధిత రైతును ఓదార్చారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటామని భరోసా కల్పించారు. డీలరు భాస్కర్‌రెడ్డి, దొడ్డి దేవేంద్ర యాదవ్ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో జేసీ వర్గీయుల చేరిక



పార్టీలో చేరిన తబ్జూల, శింగనగుట్టపల్లి వాసులతో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దపప్పూరు: తబ్జూల, శింగనగుట్టపల్లి గ్రామాలకు చెందిన జేసీ వర్గీయులు దాదాపు 120 కుటుంబాలు ఆదివారం మండల నాయకుల సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలోకి చేరిన చంద్రశేఖర్‌రెడ్డి (పెద్దబాబు)ఓబిరెడ్డి, సుబ్బారెడ్డి, రామచంద్ర, నరసింహులతో పాటు దాదాపు 115 కుటుంబాలకు చెందిన వారికి తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ తాము ఎన్నో ఏళ్లుగా జేసీ సోదరులను నమ్ముకుని వారి విజయం కోసం ఎంత కృషి చేసినా సరైన ఆదరణ లభించలేదన్నారు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వంలో కుల, మత, రాజకీయ భేదభావాలు లేకుండా పాలన సాగిస్తుండడంతో ఆయన పాలన మెచ్చి పార్టీలో చేరామన్నారు. తాము జగనన్న గెలుపే లక్ష్యంగా పని చేస్తామని ప్రకటించారు. అన్నివేళలా ఆదుకుంటామని ఎమ్మెల్యే కెతిరెడ్డి వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమనాథరెడ్డి, జెడ్పీటీసీ రమాదేవి, ఎంపీపీ రామ్మూర్తిరెడ్డి, వైస్ ఎంపీపీలు పప్పుక కళావతి, రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా పార్లమెంటు జనరల్ సెక్రటరీ రవిప్రసాద్ రెడ్డి, సీనియర్ నాయకులు వరదాయపల్లి శివారెడ్డి, ముచ్చుకోట అమర్‌నాథ్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, చిక్కేపల్లి రామేశ్వర్ రెడ్డి, పెద్దపప్పూరు జనార్ధన్ రెడ్డి, అశోక్ రెడ్డి, ఎంపీటీసీ అనిల్ కుమార్, కుమార్ రెడ్డి, స్థానిక నేతలు నాగిరెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి సన్నిధిలో భక్తుల సందడి



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



భక్తులకు అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత నారాయణరెడ్డి

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నధిలో భక్తుల సందడి నెలకొంది. స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి ఏకవార రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచే గాక జిల్లా నలుమూలల నుంచి అశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం ప్రాంగణంలోని 108 శివలింగాలకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఇలా చేయడం వల్ల కోర్కెలు తీరుతాయని ప్రజల అభిమతం. సంతానం లేని మహిళలు ఆలయం వద్ద ఉన్న పుట్ట చుట్టూ ప్రదక్షిణలు చేశారు.ఇలా చేయడం వల్ల సంతానం కలుగుతుందన్న నమ్మకం. సాయంకాలం సహస్ర దీపాలంకరణ చేశారు. భక్తుల సౌకార్యర్థం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నారాయణ రెడ్డి తన తండ్రి వెంకటరెడ్డి జ్ఞాపకార్థం అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతపురానికి చెందిన గంట సుబ్బరాయుడు, వాణి దంపతులు రూ.3.20 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాన్ని స్వామికి వితరణ చేశారు. ఆలయ ఈఓ బాబు, ఆలయ చైర్మన్ సుబ్బిరెడ్డి భక్తులకు ఎలాంటి అసౌకార్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో హోటల్ సామగ్రి దగ్ధం



కాలిపోయిన సామగ్రి

గుంతకల్లు రూరల్: పాతకొత్తచెరువు గ్రామంలో శనివారం అర్ధరాత్రి సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి హోటల్‌లోని సామగ్రి దగ్ధమైంది. బాధితుడి వివరాల మేరకు... గ్రామానికి చెందిన శ్రీనివాసులు గ్రామ బస్టాండ్ వద్ద హోటల్ నిర్వహిస్తూ కుటుంబ పోషణ సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే శనివారం రాత్రి హోటల్ పనులు ముగించుకొని తాళం వేసుకొని ఇంటికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో మంటలు చెలరేగి హోటల్‌లో ఉన్న ఫ్రిజ్జి, హోటల్ నిర్వహణకు అవసరమైన తిండి సామగ్రి, ఇతర వస్తువులు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. ఆదివారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి కాలిపోయినట్లు గుర్తించాడు. ఘటనలో దాదాపు రూ.60 వేలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

తోపుడు బండి వితరణ



జహరాబీకి తోపుడు బండి వితరణ చేస్తున్న సంస్థ సభ్యులు

తాడిపత్రి టౌన్: స్థానిక యల్లనూరు రోడ్డుకు చెందిన పేద ముస్లిం చిరు వ్యాపారి జహరాబీకి ఆదివారం ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ సభ్యులు రూ.12 వేలు విలువ చేసే తోపుడు బండి వితరణ చేశారు. ఆమె కూరగాయలు, పండ్ల వ్యాపారం చేసుకునేందుకు తోపుడు బండి కోనేందుకు తగిన ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి తోపుడు బండి అందించినట్లు సంఘం అధ్యక్షుడు శ్రీహరి, కన్వీనర్ శ్రీరంగయ్య, చెన్నకేశవులు, ప్రధాన కార్యదర్శి శంకర్ తెలిపారు. సంఘం ఉపాధ్యక్షులు నాగభూషణరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, సభ్యులు వెంకట శివారెడ్డి, ఓబులేసు యాదవ్, కుమార్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పామిడి వీరాంజనేయులు

పామిడి: మండల కేంద్రంలోని బీసీసీ రోడ్డులో నివాసం ఉంటున్న కాసంశెట్టి అశ్వర్థ నారాయణ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. అలాగే పదో వార్డులో ఆదినారాయణ అనే వ్యక్తి అనారోగ్యంతో కన్నుమూశాడు. విషయం తెలుసుకున్న ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ వీరాంజనేయులు ఆయా ఇళ్లకు వద్దకు వెళ్లి మృతదేహాలకు పూల మాల వేసి నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు పసుల నాగరాజు, బండి శివ, ధను ఉన్నారు.